క్లుప్తంగా

అందుబాటులోకి ఆర్టీసీ క్యూఆర్ కోడ్ సేవలు

• డీఎం సుఖేందర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ సేవలు ప్రయాణికులకు మరింత చేరువలోకి రానున్నట్లు సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. సిద్దిపేట, దుబ్బాక డిపోల పరిధిలో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేకంగా ''క్యూఆర్ కోడ్''ను అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. పది యాప్‌లు అనుసంధానం చేసిన ఈ క్యూఆర్ కోడ్ ద్వారా ఆర్టీసీ సేవలు పొందవచ్చని తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్ బస్ టికెట్ బుకింగ్, ఆన్‌లైన్ బుకింగ్ యాప్, ఇన్‌స్టాగాం, ఎక్స్, యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్ చానల్, గమ్యం ఆన్‌లైన్ బుకింగ్ ఉంటాయని తెలిపారు. ఈ సేవలు ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులు వినియోగించుకోవచ్చని తెలిపారు. క్యూఆర్ కోడ్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని, ఒక్క స్కాన్‌తో ఈ సేవలను పొందవచ్చని తెలిపారు. ప్రయాణికులు యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్జీటీలకు ఓటుహక్కు కల్పించాలి



కేంద్రమంత్రి బండి సంజయ్‌తో ఎస్టీయూ వర్గల్ మండల సభ్యుల బృందం

వర్గల్(గజ్వేల్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఓటు హక్కు కల్పించాలని వర్గల్ మండల ఎస్టీయూ ఉపాధ్యాయ బృందం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. సోమవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, మొహినొద్దీన్, జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్ పేర్కొన్నారు. ఎస్జీటీలకు ఓటు హక్కు అంశం తమ దృష్టిలో ఉందని, దాన్ని కల్పించే బాధ్యత తనదని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నేత



బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్క సతీశ్‌కుమార్

సిద్దిపేటకమాన్: పీసీసీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లో సిద్దిపేట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్క సతీశ్‌కుమార్ కలిసి మెమొంటోను అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సతీశ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతీ కార్యకర్తను పార్టీ అధిష్ఠానం గుర్తిస్తోందన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు సురేశ్, నరేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి కృషి



నగరి ప్రీతంతో కాంగ్రెస్ నేతలు

దౌల్తాబాద్ (దుబ్బాక) : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతంను ఆయన నివాసంలో సోమవారం కాంగ్రెస్ దౌల్తాబాద్ మండల ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి పని చేస్తానని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం చెప్పారని స్వామి తెలిపారు. కార్యక్రమంలో స్వామి, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో బొజ్జ గణపయ్యకు సమర్పిస్తున్న 60 రకాల ప్రసాదాలు




కొమురవెల్లి: మల్లన్న ఆలయంలోని గణనాథుడిని ఊరేగిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు



దుబ్బాకలో... అన్నదానం



హుస్నాబాద్: వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న రజిత



బెజ్జంకిలో..

బైబై గణేశా

గణపతి నవరాత్రులు వైభవంగా ముగిశాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా శోభాయాత్రలు నిర్వహించి వినాయకుని ప్రతిమలను చెరువులు, కుంటలు, నది పరివాహక ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. తొలుత మండపాల నుంచి ప్రత్యేక వాహనాలపై గణనాథుడిని అధిరోహింపజేశారు. అనంతరం డప్పు చప్పుళ్లు, యువతీ యువకులు, మహిళల నృత్యాలు చేసుకుంటూ నిమజ్జన ప్రాంతాలకు చేరుకుని గణనాథులను గంగమ్మ ఒడికి చేర్చారు.



గజ్వేల్‌రూరల్: మహిళల కోలాటాలు, భజనల మధ్య నిమజ్జనానికి తరలివెళ్తున్న బొజ్జ గణపయ్య

వైద్యం అందని ద్రాక్షేనా?

• నత్తనడకన ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలు
• అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమే కారణం
• ఇబ్బందుల్లో గ్రామాల ప్రజలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆరోగ్య ఉపవైద్య కేంద్రాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. దీంతో వైద్య కేంద్రాల నిర్మాణాలకు మోక్షం లభించడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది.



వీరారెడ్డిపల్లిలో అసంపూర్తిగా ఆరోగ్య ఉప కేంద్రం



మిరుదొడ్డి మండలం అల్వాలలో ప్రారంభించినా తెరుచుకోని ఆరోగ్య ఉప కేంద్రం

మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల, మిరుదొడ్డి, మల్లుపల్లి, ధర్మారం, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం, వీరారెడ్డిపల్లి, ఖాజీపూర్, భూంపల్లి, అక్బర్‌పేట తదితర గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. ఒక్కో ఆరోగ్య ఉప కేంద్రాన్ని నిర్మించడానికి సుమారు రూ. 20 లక్షల నిధులను కేటాయించారు. మూడు సంవత్సరాలు గడుస్తున్నా అత్యాధునిక ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు ఇంకా కొనసా....గుతూనే ఉన్నాయి. అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వైద్య కేంద్రాల నిర్మాణాలకు మోక్షం లభించడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఆరోగ్య ఉప కేంద్రాలను పూర్తి చేసి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని మిరుదొడ్డి మండలం, అక్బర్‌పేట-భూంపల్లి మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రారంభించినా...

మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల గ్రామంలో జనవరిలో మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ప్రారంభించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నేటికీ తలుపులు తెరుచుకోవడం లేదు. నిర్మాణం పూర్తయినప్పటికీ అధికారులు బిల్లులు చెల్లించలేదన్న కారణంతో సదరు కాంట్రాక్టర్ ఉప కేంద్రం తాళాలను వైద్యాధికారులకు అందజేయలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నిధుల లేమితో నిలిచిన నిర్మాణాలు



మిరుదొడ్డి అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలో అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు నిధుల లేమితో ఆగిపోయాయి. మెటీరియల్ కాంపోనెంట్ నిధులు విడుదల కావాల్సి ఉంది. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

– ఎండీ. జహూరుద్దీన్, మండల పంచాయతీ ఆఫీసర్, మిరుదొడ్డి

తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం



తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సచివాలయం వద్ద మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ప్రతిష్ఠించడాన్ని నిరసిస్తూ సోమవారం రంగధాంపల్లి అమరుల స్తూపం వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు తెలంగాణ అమరులకు నివాళులర్పించి, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి బదులుగా, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం సరికాదన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి బదులుగా మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, తెలంగాణ దివంగత నేతలు భాగ్యరెడ్డివర్మ, సురవరం ప్రతాప్‌రెడ్డి, రావినారాయణరెడ్డి, కాళోజీ, చాకలి ఐలమ్మ, ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్, తదితరుల విగ్రహాలు ప్రతిష్ఠించాల్సిందన్నారు. తెలంగాణకు సంబంధం లేని వ్యక్తి రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం కేవలం కాంగ్రెస్ అధిష్ఠానం మెప్పు కోసమే అని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించడం తథ్యం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా...



సన్నాయి మేళతాళాల మధ్య వినాయక నిమజ్జన ఊరేగింపు

వినాయక నిమజ్జనం అంటేనే హంగు ఆర్భాటాలు, డీజే మోత, విచిత్ర వేషధారణలు, యువత కేరింతలతో కూడిన డ్యాన్స్.. ఇవేమి ఇక్కడ కనిపించవు. కేవలం సంప్రదాయమే సాక్షాత్కారమవుతుంది. సోమవారం కేవీఎం హోమ్స్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక నిమజ్జనం సన్నాయి మేళతాళాల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వాహకులు నిమజ్జనం నిర్వహించారు.

– సిద్దిపేటజోన్

కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందే



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల స్వామి

మిరుదొడ్డి(దుబ్బాక): మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సోమవారం మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలపరిధిలోని మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఏకకాలంలో బిల్లులు చెల్లించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని మండిపడ్డారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం కోడి గుడ్లు సరఫరా చేస్తోందన్నారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు కూడా గుడ్లు సరఫరా చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనాలను అమలు చేసేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి మధ్యాహ్న భోజన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మిరుదొడ్డి మండల కార్యదర్శి మద్దెల అంజయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు కాస పద్మ, మహంకాళి లక్ష్మి, లావణ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో నిమజ్జన ఏర్పాట్లు

దుబ్బాకటౌన్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా గ్రామాల్లో చెరువుల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. రాయపోల్ మండలం బేగంపేటలో పెద్ద చెరువుకట్టపై బీజేపీ ఎస్సీ మోర్చా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంకిడి స్వామి తన సొంత ఖర్చులతో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

ప్రతీయేటా స్కూల్‌కు రూ.లక్ష

• పూర్వ విద్యార్థి జెట్టి మల్లేశం



రూ.లక్ష చెక్కును పాఠశాల ఉపాధ్యాయులకు అందజేస్తున్న జెట్టి మల్లేశం

సిద్దిపేటఅర్బన్: ప్రతీ యేడాది స్కూల్ మౌలిక సదుపాయాల కోసం రూ. లక్ష ఇస్తానని పూర్వ విద్యార్థి జెట్టి మల్లేశం తెలిపారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు రూ.లక్ష అందజేశారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లికి చెందిన అతను తడ్కపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చార్టెడ్ అకౌంటెంట్(సీఏ)గా పనిచేస్తున్నాడు. అప్పుడు పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా లక్ష రూపాయలు ఇస్తానని ప్రకటించారు. ఆ మేరకు తోటి విద్యార్థులతో కలిసి ఆయన లక్ష ఇచ్చి, ప్రతీయేటా ఇలాగే ఇస్తానని తెలిపారు. మల్లేశంను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సత్కరించారు. అలాగే పాఠశాలలో 1995–96లో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకొన్నారు.

బీసీ కులగణన నిర్ణయం హర్షణీయం

చేర్యాల(సిద్దిపేట): బీసీ కులగణన నిర్ణయం హర్షణీయమని బీసీ సంఘం జిల్లా నాయకులు శవల్ల రాజయ్య, బోయిని రాజు అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో వారు మాట్లాడుతూ, కులగణన నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దాంతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం సీఎంగా రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పదవీ బాధ్యతలు చేపట్టడం వల్లే సాధ్యమైందన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కేటాయించడం ద్వారా వెనుకబడిన బీసీలకు మేలు కలుగుతుంది

ఆర్థిక సాయం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రామవరానికి చెందిన మహమ్మద్ ఇబ్రహీం కుమారుడి పేరిట ఇతని ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులు రూ.62,500 ఫిక్స్‌డ్ డిపాజిట్(ఎఫ్‌డీ) చేశారు. ఇటీవల ఇబ్రహీం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా ఎఫ్‌డీ చేసిన పత్రాలు కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు మామిడాల మల్లేశ్, కుందన సంపత్, జాటోతు రవి, మాలోతు రమేశ్, భానోతు మోహన్, లింగాల పర్శరాములు, విజయ, జ్యోతి, సునీతారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆపదలో అండగా సీఎంఆర్ఎఫ్



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం సహాయనిధి నిలుస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సోమవారం కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్యకు రూ.60 వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కలీమొద్దీన్, దాస అంజయ్య, భిక్షపతి, అంజిరెడ్డి, రాజేశం గౌడ్, రాగుల అశోక్, అంబటి విఠల్, పల్లె పర్శరాములు పాల్గొన్నారు.

◆ అంగన్‌వాడీలో సీమంతం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కేశనాయక్‌తండా గ్రామ పరిధిలో ఉన్న చెరువుముందుతండా అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పోషణ్ మాసం గురించి వివరించారు. అలాగే సీజనల్ వ్యాధులు సోకితే నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షించుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భానోతు రవీందర్, ఆశా కార్యకర్త గుగులోతు సరిత, సరోజన, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఏఎన్‌ఎంలు



లడ్డూ రూ.37,116

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్లలో ఉన్న వినాయకుడి లడ్డూ మండలవ్యాప్తంగా అత్యధిక రూ. 37,116 వేలం పాట పలికింది. 40 ఏళ్లుగా గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద యువచైతన్య మిత్ర మండలి ఆధ్వర్యంలో గణనాథుడిని ఏర్పాటు చేసుకొని అత్యంత వైభవంగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ యేడు కూడా నిర్వహించి లడ్డూ వేలంవేయగా నందాల సుధాకర్ రూ 37,116లకు దక్కించుకున్నారు. దీంతో అధ్యక్షుడు చెంది ఆంజనేయులు సుధాకర్‌కు దాన్ని అందజేశారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.